ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు




PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

నిరుపేద కుటుంబాలకు వెన్నుదన్నుగా యలమందల జగదీష్




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 105 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- ఆదివారం 12 ఏప్రిల్ 2026


# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

- నియోజకవర్గాల పునర్విభజనలో అంతరం
- 2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు
- 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్
- బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం
- రవీంద్రభారతిలో పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో డిప్యూటీ భట్టి



**హైదరాబాద్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** దక్షిణాది రాష్ట్రాలపై కేంద్రం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలన్నారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న భట్టి విక్రమార్క.. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో కులగణన చేపట్టి ఆదర్శంగా నిలిచామన్నారు . బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అందించాలనే పట్టుదలతో ఢిల్లీ వేదికగా ధర్నా కూడా చేశామని చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వం మన చట్టాన్ని మిగతా2లో...

# బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం

**అందుకు బిజెపిపై దాడులకు తెగిస్తున్నారు**

**బెంగాల్ ప్రచార సభలో ప్రధాని మోడీ**



**కోల్‌కతా,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పశ్చిమ బెంగాల్‌లో భారతీయ జనతా పార్టీకి పెరుగుతున్న ప్రజా మద్దతును చూసి తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) భయాందోళనలో ఉందని ప్రధాన మంత్రి మోదీ అన్నారు. శనివారం రాష్ట్రంలో జరిగిన ఒక బహిరంగ సభలో పాల్గొన్న మోదీ, ప్రస్తుత అధికార పార్టీ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో బీజేపీకి లభిస్తున్న ఆదరణను చూసి మమతా బెనర్జీ నేతృత్వంలోని మిగతా2లో...

## పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోడీ సంభాషణ



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మా జ్యోతిబా పులే 200వ జయంతి సందర్భంగా పార్లమెంటు ప్రాంగణంలో శనివారంనాడు ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. ప్రేరణా స్థల్ వద్ద నివాళులు అర్పించేందుకు వచ్చిన ప్రధానమంత్రి మోదీ, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు సంభాషించుకున్నారు. తొలుత ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రధాని అక్కడే ఉన్న ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభలో బీజేపీ నేత జేపీనడ్డా, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులను పలకరిస్తూ ముందుకు వెళ్లారు. మళ్లీ వెనక్కి వచ్చి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడారు. పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాన పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్న తరుణంలో ప్రధాని, ప్రతిపక్ష నేత పరస్పరం సంభాషించుకోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఇందుకు సంబంధించిన మిగతా2లో...



## చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

**- మరోమారు హెచ్చరించిన ట్రంప్**

**న్యూయార్క్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జేరెడ్ కుష్ణనర్‌లు ఇప్పటికే పాకిస్థాన్ చేరుకున్నారు. మిగతా2లో...

## పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు




## బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

**కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్**



**ములుగు,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. శనివారం ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇప్పటికే మిగతా2లో...

## పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

● అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలి ● సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా కువిమర్శలు తగవు ● మంత్రి సీతక్క మరోమారు గట్టిగా జవాబు



**ములుగు,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలు దేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా మిగతా2లో...




## హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

**కాల్‌ఉప విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్య హ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు మిగతా2లో...

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా... అవి కేసీఆర్ ఎన్నికలే

● కెసిఆర్ అధికారంలోకి వచ్చేలా ఫలితాలు ● అనేక హామీలతో డబ్బా కొట్టిన రేవంత్ ● నిరుద్యోగులను మోసం చేసిన ప్రభుత్వం

● ఇబ్రహింపట్నం కార్యకార్యర్తల భేటీలో కెటిఆర్



**హైదరాబాద్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

మిగతా2లో...

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా... అవి కేసీఆర్ ఎన్నికలే

(మొదటి పేజీ తరువాయి)

నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుం టున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మీదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టు కున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తద్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.

# పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు

**విద్యారంగం పూర్తిగా అస్తవ్యస్తం**

**అక్షరాస్యతలో వెనకబడుతున్న తెలంగాణ**

**కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రకటన**



**హైదరాబాద్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం... మహాత్మా జ్యోతి రావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహ నీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతో పాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటుపడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగి స్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించక పోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకు న్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝునాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతి రావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# పంట కొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

**సిద్దిపేట,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.


# పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్ముంటే మీ ఆరోపణలు నిరూపిం చండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**● అధికారికంగా ప్రకటించిన బోర్డు**




**హైదరాబాద్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలు జరగ్గా.. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు తొమ్మిదిన్నర లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. మరోవైపు, ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ని నేరుగా తమ వాట్సప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొనే సదుపాయాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. ఈ ఫలితాల కోసం మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# బెంగాల్లో తృణమూల్‌కు ఓటమి భయం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం భయాందోళనలకు గురవుతోందని ప్రధాని పేర్కొన్నారు. ఓటమి భయంతోనే టీఎంసీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు భద్రత కల్పిస్తామని, రాజకీయ హింసలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. పూర్బ బర్ధమాన్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడుతూ.. 'పశ్చిమ బెంగాల్ నుంచి చొరబాటుదారులందరినీ తరిమేస్తాం. అలాంటి వారికి మద్దతునిచ్చి, వారు ఇక్కడ స్థిరపడటానికి సహాయపడిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. అమాయక ప్రజలపై, రాజకీయ ప్రత్యర్థులపై దాడులకు పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెడతాం. అవినీతి, శాంతిభద్రతలపై శ్వేతపత్రాన్ని విడుదల చేస్తాం. ప్రతి టీఎంసీ గూండా, సిండికేట్, అవినీతిపరుడైన ఎమ్మెల్యే లేదా మంత్రిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రాజకీయ హింసపై విచారణ జరిపేందుకు, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ఒక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తాం. ఇప్పుడు అమలు అవుతున్న పథకాలను బీజేపీ అడ్డుకోదు. మేం అధికారంలోకి వస్తే తొలి కేబినెట్ సమావేశంలోనే పశ్చిమ బెంగాల్‌లో ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని అమలు చేస్తాం' అని అన్నారు. కాగా, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

# పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌తో మోడీ సంభాషణ

(మొదటి పేజీ తరువాయి)

వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఇటీవల కాలంలో పలు పబ్లిక్ స్పీచ్‌లు, రాజకీయ ర్యాలీల్లో మోదీ, రాహుల్ మధ్య విమర్శలు చోటుచేసుకున్నాయి. మోదీ రాజీపడే నేత అని, మన విదేశాంగ విధానం మోదీ పర్సనల్ పాలసీగా మారిందని, ఆయన ఏమి చేయాలో ఏమి చేయకూడదో ట్రంప్ నిర్దేశిస్తురటారని రాహుల్ విమర్శలు గుప్పించారు. రాహుల్ విమర్శలను మోదీ తిప్పికొట్టుతూ, ఆయనొక స్వయం ప్రకటిత రాజకుమారుడని చురకలు వేశారు. తాజాగా వీరిద్దరు ముచ్చటించుకోవడం ఆసక్తికర పరిణామంగా చ ఎప్పుకోవాలి.

# చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఇరాన్ ప్రతినిధులు కూడా ఇస్లామాబాద్ వచ్చేశారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. ర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్ ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు. శుక్రవారం పెట్టిన ఓ పోస్టులో.. 'ఇరాన్ యుద్ధం చేసే దానికంటే.. ఫేక్ న్యూస్ మీడియాను, పబ్లిక్ రిలేషన్స్‌ను హ్యాండిల్ చేయటంలో అద్భుతమైన ప్రతిభ కనబరుస్తోంది' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# హోర్ముజ్ దాటిన మరో భారతీయ నౌక

(మొదటి పేజీ తరువాయి)

తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# దక్షిణాది రాష్ట్రాలను బలహీన పరచే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

ఆమోదించకుండా కాలయాపన చేస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై సామాజిక న్యాయమే లక్ష్యంగా.. ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. సీఎం రేవంత్ నాయకత్వంలో, సామాజిక స్పృహతో కూడిన పాలనను అందిస్తున్నామని అన్నారు భట్టి విక్రమార్క. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ఊపిరిగా తీసుకుని కుల వివక్ష లేని సమాజం కోసం మేము అడుగులు వేస్తున్నామన్నారు భట్టి. ఆనాడు పూలే లాంటి మహనీయులే వివక్షకు గురైనా భవిష్యత్ తరాల కోసం వారు వేసిన పునాదులే మార్గదర్శకాలన్నారు భట్టి.

# బిఆర్ఎస్‌లోకి వెళ్లి జీవన్ రెడ్డి తప్పు చేశారు

(మొదటి పేజీ తరువాయి)

బిఆర్ఎస్‌లోకి వెళ్లిన వారి గతి ఏమయ్యిందో చూశామని అన్నారు. బిఆర్ఎస్‌లో కుటుంబానికే ప్రాధాన్యమని అన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోందన్నారు. ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ.8 లక్షల కోట్లు అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

# 20న మోతిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ



**హైదరాబాద్,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

# భారతదేశానికి ఆదర్శం జ్యోతిరావుసావిత్రిబాయి పూలే దంపతులు

**● "వారికి భారతరత్న ఇవ్వాలి" గొడిసెల శ్రీహరి**

**బెల్లంపల్లి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా జాజ్జరెల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో పూలేపెరి యార్ అంబేద్కర్ ఆలోచన వేదిక అధ్యక్షుడు గొడిసెల శ్రీహరి మాట్లాడారు. దేశానికి నిజమైన మార్గదర్శకులు జ్యోతిరావు పూలే మరియు సావిత్రిబాయి పూలే దంపతులేనని, సమాజంలో సమానత్వం కోసం వారు చేసిన సేవలను గుర్తించి వారికి "భారతరత్న" ప్రకటించాలని డిమాండ్ చేశారు. జ్యోతిరావు సావిత్రిబాయి దంపతులు కలిసి భారతదేశంలోనే మొదటిసారిగా బాలికల విద్యకు శ్రీకారం చుట్టి పాఠశాలలను స్థాపించిన గొప్ప సంస్కర్తలని తెలిపారు. ఆ కాలంలో అగ్రవర్ణాల నుంచి ఎన్నో అవమానాలు ఎదురైనా వెనుకడుగు వేయకుండా విద్య ద్వారా సమాజంలో చైతన్యం తీసుకువచ్చారని కొనియాడారు. "విద్య వల్లే వివేకం, వివేకం వల్లే జ్ఞానం పెరుగుతుంది" అనే సిద్ధాంతంతో అజ్ఞానాన్ని తొలగించి సమానత్వ సమాజం నిర్మాణానికి పునాది వేశారు అని పేర్కొన్నారు. 1873లో జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక సమాజం ద్వారా కుల వివక్ష, మత మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం సాగిందని వివరించారు. బ్రాహ్మణ ఆధిపత్యానికి వ్యతిరేకంగా శూద్రులు, అతిశూద్రులు, వెనుకబడిన వర్గాలను ఏకం చేసి సమాన హక్కుల కోసం ఉద్యమాన్ని ముందుకు నడిపారని చెప్పారు. జ్యోతిరావు పూలే తన రచనల ద్వారా భారత చరిత్రలోని వాస్తవాలను వెలికి తీసి "గులాంగిరి", "పూజారి తత్వం" వంటి గ్రంథాల ద్వారా సమాజాన్ని చైతన్యపరిచారని గుర్తు చేశారు. ప్రజలు నిజమైన చరిత్ర తెలుసుకోవాలంటే ప్రతి ఒక్కరూ "గులాంగిరి" పుస్తకాన్ని చదవాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ వాడుగురి శాంత



చినబాబు, ఉపసర్పంచ్ కొట్రంగి రాజకుమార్, కొట్రంగి రమేష్, వేదిక ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్, కార్యదర్శి అక్కు కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిసెల సామి, మాటూరి కృష్ణ, నల్లవెల్లి అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిరుపేద కుటుంబాలకు వెన్నుదన్నుగా యలమందల జగదీష్







**- 20 నిరుపేదలకు కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకుల, 25కేజీల బియ్యం పంపిణీ**

**- పలుచోట్ల ఘనంగా యలమందల జగదీష్ జన్మదిన వేడుకలు**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఆపదలో ఉన్న 20 నిరుపేద కుటుంబాల వారికి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం పంపిణీ చేసి ఆ కుటుంబాలకు వెన్నుదన్నుగా ఎలక్ట్రానిక్ మీడియా ఖమ్మం నగర అధ్యక్షులు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర ప్రెసిడెంట్ గా యలమందల జగదీష్ నిలిచారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1వ డివిజన్ కైకొండాయిగూడెంకు చెందిన పేద ప్రజలకు సహాయం చేయడం తన బాధ్యతగా యలమందల జగదీష్ నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమని, మానవసేవే.. మాధవసేవ అన్నారు. ఈ సందర్భంగా కైకొండాయిగూడెం పేద ప్రజలు మాట్లాడుతూ.. వేసవికాలం కావడం, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కులాలకతీతంగా మా పేద కుటుంబాలకు నెల రోజులకు సరిపడే నిత్యవసర సరుకులు, 25 కేజీల బియ్యం అందజేసి మా కుటుంబాలకు పెద్దన్నగా జగదీష్ అన్న నిలిచాడని ఆయన చేసిన మేలు మరచిపోమని, ఏదో ఒక రకంగా ఆయన రుణాన్ని తీర్చుకుంటామని కుటుంబ సభ్యుల సాక్షిగా హామీ ఇచ్చారు. మా కడుపులు నింపి మమ్ములను ఆదుకున్న జగదీష్ అన్న నిండు నూరేళ్ళు, ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని వారు దీవించారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని భారీ కేక్ కట్ చేసి పాల్గొన్న ప్రతి ఒక్కరికి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు,జగదీష్ అన్న యువసేన (వైజెఎస్), స్నేహితులు పెద్ద ఎత్తున పాల్గొని బొకేలు, శాలువలతో జగదీష్ ను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లోని జర్నలిస్టుల మధ్య, నాయి బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో, దొడ్డి కొమరయ్య సినిమా కార్యాలయంలో, ఎల్.హెచ్.పి. ఎస్ ఆధ్వర్యంలో, విద్యానగర్ కాలనీలో యలమందల జగదీష్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో కైకొండాయిగూడెం గ్రామ ప్రజలు, మీడియా మిత్రులు, స్నేహితులు, నాయి బ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రబోయినపల్లి, పెద్ద కోరుకొండిలో డీసీఎంఎస్ కొనుగోలు కేంద్రాల ప్రారంభం







**రైతులకు మేలు చేసే దిశగా కీలక అడుగు: ఏఎంసి చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్**

**కల్లూరు, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని ఎర్రబోయినపల్లి, పెద్ద కోరుకొండి గ్రామాల్లో డీసీఎంఎస్ ధాన్యశీ కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్, గ్రామ సర్పంచ్ దేవరపు నాగమణి తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామ నాయకులు విశేషంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు పోట్రూ అర్జున్ రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దొడ్డపనేని శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు. రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర కల్పించడంలో ఈ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ సూపర్వైజర్ వినోద్ కుమార్, పెద్దకొరుకోండి గ్రామ సర్పంచ్ దేవరపు నాగమణి, కాంగ్రెస్ నాయకులు మాదిరాజ్ అన్నం రాజు, మచ్చ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు శీలం కృష్ణారెడ్డి, 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, యువ నాయకులు యాస శ్రీకాంత్, గ్రామ నాయకులు, జిల్లా యువజన నాయకులు ధరావత్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, ప్రభుత్వము నిర్ణయించిన మద్దతు ధరలకు ధాన్యం కొనుగోలు చేయబడుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతులకు లాభం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతులు ఈ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# పూలే స్ఫూర్తితో కలం వీరులకు సన్మానం

**- సమానత్వ సందేశం ప్రతిధ్వనించిన వేడుక**

**- పూలే ఐడియాలజీ సొసైటీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఘనమైన గౌరవం**

**- జర్నలిస్ట్ బచ్చలకూరి బాలరాజు**

**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో మార్పు కోసం కలం ద్వారా పోరాడుతున్న జర్నలిస్టులను గౌరవించడం అంటే సమానత్వం కోసం పోరాటాన్ని గౌరవించినట్టేనని పూలే ఐడియాలజీ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమం చాటిచెప్పింది. మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా ఖమ్మంలోని పూలే ప్రాంగణంలో శనివారం ఈ కార్యక్రమం భావోద్వేగభరితంగా జరిగింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పుష్ప నివాళులు అర్పిస్తూ, ఆయన ఆశయాలను స్మరించుకున్నారు. అనంతరం జర్నలిస్టులకు ఘనంగా సన్మానం చేసి, సమాజంలో



అవగాహన పెంచడంలో వారి పాత్రను కొనియాడారు. జ్ఞాన తెలంగాణ జిల్లా రిపోర్టర్ బచ్చలకూరి బాలరాజు మాట్లాడుతూ, పూలేసావిత్రిబాయి పూలే దంపతులు చేసిన త్యాగాలు నేటి బహుజనుల సామాజిక, రాజకీయ, విద్యా చైతన్యానికి మూలస్తంభాలని పేర్కొన్నారు. 1827లో మహారాష్ట్రలోని పూణేలో జన్మించిన పూలే, మహిళల విద్య కోసం, కుల నిర్మూలన కోసం చేసిన కృషి సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని తెలిపారు. 1873లో సమాజంలోని అసమానతలను తొలగించేందుకు సంస్థను స్థాపించి, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు పూలే అని అన్నారు. 1888లో ఆయనకు "మహాత్మా" బిరుదు లభించడం ఆయన సేవలకు గుర్తింపని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు మరియు అగ్రకుల పేదల అభివృద్ధి కోసం ఆయన చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం మొత్తం పూలే ఆశయాలను ప్రతిధ్వనింపజేస్తూ, సమాన సమాజ నిర్మాణానికి మనందరినీ మరింత కట్టుబడేలా చేసిన సందేశాత్మక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి వేడుకలు



**ములుగు,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశ సామాజిక విప్లవ పితామహుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి శ్రీ మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి ఉత్సవాలను శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని సంక్షేమ భవనంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గారి ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గారు మాట్లాడుతూ.. సామాజిక న్యాయమే లక్ష్యంగా పూలే గారు నడిపిన "సత్యశోధక ఉద్యమం" దేశ చరిత్రలో ఒక మైలురాయి అని కొనియాడారు. బ్రిటిష్ వలస పాలన కాలంలో ఉన్న సామాజిక పరిస్థితులను ఎదిరించి, కుల వివక్షకు వ్యతిరేకంగా మరియు స్త్రీ విద్య ఆవశ్యకత కోసం ఆయన చేసిన కృషి అజరామరమని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు, యువత పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం. బిక్షపతి గౌడ్, జె. రవి, పి. శ్యాం, సాగర్, ఎం. సంపత్, ఎం. శ్యాం, సతీష్, శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బిసి వెల్ఫేర్ శాఖ ఉద్యోగులు మొగిలి సరిత, మానస, రేణుక, సాదలు, కుమారస్వామి, ఇ. ప్రతాప్, జి. గోపాల్ చారి, రత్నాకర్, బిసి కార్యాలయ సిబ్బంది, నాలుగవ తరగతి ఉద్యోగులు, విద్యార్థులు మరియు విలేకరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు

**● పూలే ఆలోచన విధానాలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం**

**● సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులులినల్లు సుధాకర్ రెడ్డి**



**కురవి ఏప్రిల్ 11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మహాత్మ జ్యోతిరావు పూలే ఆలోచన విధానాలు నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం అని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి అన్నారుకురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో సిపిఐ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకల సందర్భంగా పూలే చిత్ర పటానికి పూల మాల వేసి నల్లు సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆనాటి సమాజంలో అత్యంత జుగుప్సాకరంగా ఉన్న అంటరాని తనం, వివక్షతలపైన ఎన్నో ఆటంకాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో పోరాడి, సామాజిక రుగ్మతలు పారదోలడానికి, సత్యశోధక్ సంస్థ లాంటి ఎన్నో సంస్థలను నెలకొల్పి, పేదలు,అణగరిన వర్గాల ఆత్మగౌరవాన్ని కాపాడడానికి మరెన్నో ఉద్యమాలకు సారథ్యం వహించిన అగ్రశ్రేణి సంఘసంస్కర్తగా లక్షలాది మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన సామాజిక విప్లవకారుడు పూలే అని అన్నారు .జ్ఞానం కొందరి సొత్తు కాదని, ఆశక్తి అందరికీ అందాలనీ, అనేకులకు అక్షరశీ అందనీ ద్రాక్షగా ఉన్న ఆ కాలంలోనే బాలికల కోసం, విద్యా అవకాశాలు లేని వర్గాల కోసం పాఠశాలలు తెరిచి విద్యా విప్లవానికి నాంది పలికిన గొప్ప దార్శనికుడు పూలే నేటి సమాజానికి ఆదర్శనీయుడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి తురక రమేష్, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, నిలిగొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై వెంకటకృష్ణ








**తల్లాడ, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :**తల్లాడ మండల పరిధిలోని మంగాపురం గ్రామంలో రామాలయం సెంటర్లో ప్రజల దాహన్ని తీర్చేందుకు మంగాపురం సర్పంచ్ దుగ్గిదేవర నాగ నరసింహారావు ఉపసర్పంచ్ గుజ్జలపూడి చింటూ వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం ను తల్లాడ ఎస్సై ఎన్ వెంకటకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ మాట్లాడుతూ సర్పంచ్ ని అభినందిస్తూ గ్రామంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నారని ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం చేయాలని కోరారు. వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతాయని ప్రస్తుతం ఎండలు అత్యధికంగా ఉండటంతో ప్రజలకు చల్లని నీటిని అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమని చెప్పారు. ప్రజలు ఎండలో తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయడానికి దాతలు కూడా ముందుకు రావాలి గ్రామంలో యువత కూడా జాగ్రత్తలు తీసుకుంటూ సేవా కార్యక్రమంలో ముందు ఉండాలని గ్రామ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి జొన్నలగడ్డ పరుశురాం, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, ప్రజలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా విద్యకు ఆధ్యుడు పూలే

**బర్కత్ పుర ఏప్రిల్ 11(పి సి డబ్ల్యూ న్యూస్):** సమ సమాజం కోసం ఉద్యమించిన స్ఫూర్తి ప్రదాత, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావుపూలే చిరస్మరణీయుడని సీనియర్ కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు కొనియాడారు. జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం బర్కత్పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జ్యోతిరావు చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి చదువు ఒక్కటే మార్గమని భావించిన మహనీయుడు పూలే అన్నారు. పూలే సిద్ధాంతాలు అందరికి ఆదర్శప్రాయమని అన్నారు. పూలే అలుపెరగని పోరాటం చేశారన్నారు. మానవుడి విద్య జ్ఞానజ్యోతి లాంటిదని పూలే విశ్వసించే వారన్నారు. బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి వారి హక్కుల కోసం పోరాటం చేయడంతో పాటు సాధికారత దిశగా కృషి చేశారన్నారు.



# అమ్మ మాట అంగన్వాడీ బాట“తోనే ఆరోగ్యవంతమైన తెలంగాణ

## వార్డ్ సభ్యులకు ఐదు రోజులు పాటు శిక్షణ శిబిరం

**మహబూబాద్ జిల్లా సీరోల్ (ఏప్రిల్10) పి.సి.డబ్ల్యూ న్యూస్:** మండల పరిధిలో గల అన్ని గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులకు 13 తేదీన నుంచి 18 తేదీ వరకు ఐదు రోజులపాటు శిక్షణ శిబిరం కార్యక్రమం సీరోల్ జిల్లా పరిషత్ హై స్కూల్ లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:00 వరకు ఉంటుందని వార్డ్ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని సీరోల్ మండల ఎంపీఓ గౌస్ పాషా పత్రిక ప్రకటనలో తెలిపారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ మాలోతు రమేష్ నాయక్

**- బిఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్**



**కురవి ఏప్రిల్11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** మండలంలోని ఎలక చెట్టు తండా గ్రామపంచాయతీ పరిధిలోని భద్రూతండాలో ఎంపీపీ నిధులలో మంజూరైన సిసి రోడ్డు పనులను నేడు సర్పంచ్ మాలోత్ రమేష్ నాయక్ ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నాయకులు,బి ఆర్ ఎస్ యూత్ రాష్ట్ర నాయకులు గుగులోతు రవినాయక్,ఉప సర్పంచ్ గుగులోతు వీరన్న,వార్డు సభ్యులు బాదావత్ నరేష్,భూక్య రమాదేవి,గ్రామ కార్యదర్శి సురేష్,నాయకులు భద్రూ , సేటు,వెంకన్న,సోషల్ మీడియా అధ్యక్షుడు భూక్య మల్సూర్, జాటోతు కిషన్, జాటోతు భద్రూ,వీరన్న,భీమా,శంకర్, భద్రు,స్థానిక నాయకులు కార్యకర్తలు,యువకులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ సాధనకై అందరూ కలిసి రావాలి

**• జెట్టి శివప్రసాద్ యాదవ్ సాధన సమితి ప్రచార కార్యదర్శి**

**రామన్నపేట ఏప్రిల్11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము లోని ఒక నియోజకవర్గం గా ఉన్న రామన్నపేట ను నియోజకవర్గం తొలిగించారు అప్పటి నుండి ఇప్పటి వరకు ఇక్కడ ఉన్న ప్రజలు అనేక పరిపాలనా, అభివృద్ధి సమస్యలను ఎదుర్కొంటున్నారు.మా ప్రధాన సమస్యలు:ప్రస్తుత నియోజకవర్గ కేంద్రాలు దూరంగా ఉండడం వల్ల ప్రజలకు ఇబ్బందులుఅభివృద్ధి అసమానంగా జరగడంప్రజలకు సరైన ప్రతినిధిత్వం లేకపోవడంగ్రామీణ ప్రాంతాల అవసరాలు పట్టించుకోబడకపోవడంమా డిమాండ్: రామన్నపేట ప్రాంతానికి ప్రత్యేక శాసనసభ నియోజకవర్గాన్ని పునరుద్ధరించి, ప్రజలకు సమర్థవంతమైన పరిపాలన అందించాలని కోరుతున్నాము రామన్నపేట నియోజకవర్గం సాధనకు ప్రతి ఒక్కరు సైనికునిగా, యువత, విద్యార్థులు, రాజకీయ నాయకులు, అన్ని వర్గాల ప్రజలు ఈ ఉద్యమం లో భాగస్వామ్యం కావాలని కోరుతున్నాము అని పత్రికా ప్రకటనలు తెలిపినారు

## కార్యకర్తలకు అండగా ఉంటా...

**- పూస. బాలకిషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు**



**రామన్నపేట ఏప్రిల్11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన శివగల. జ్ఞానేశ్వర్మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పూస బాలకిషన్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసి పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసినలి ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూస బాలానరసింహ జిల్లా నాయకులు పూస బాలకిషన్లి , వార్డు మెంబర్లు,ప్రజాప్రతినిధులు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ శాఖ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు యూత్ నాయకులు తదితరులు పాల్గొనడం జరిగింది

### జంక్ ఫుడ్‌కు స్వస్తి చెప్తూ ఇంటి వంటకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

### గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం: మంత్రి సీతక్క





**ములుగు,ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** అమ్మ మాట – అంగన్వాడీ బాట“తోనే ఆరోగ్యవంతమైన తెలంగాణను నిర్మించడం జరుగుతుందని,జంక్ ఫుడ్‌కు స్వస్తి చెప్తూ ఇంటి వంటకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలని,గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ములుగు జిల్లా కేంద్రంలోని ఐ లవ్ ములుగు థీమ్ వద్ద పోషణ్ పక్వాడ కార్యక్రమం అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ములుగు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆఫీస్, పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాలను ప్రారంభించి పద్మశాలి భవన్ లో ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ రాష్ట్రంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలు చిన్నారుల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ఐసీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో ‘పోషణ్ పక్వాడా‘ (పోషకాహార మాసోత్సవం) వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఏప్రిల్ 9 నుండి ఏప్రిల్ 23 వరకు 15 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.పోషకాహార లోపంపై మనం భుజించే ఆహారంలో పోషక విలువలు తగ్గడం, కల్తీ ఆహారం, జంక్ ఫుడ్ తినడం అలవాట్ల వలన చిన్న వయసులోనే పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని,బయట దొరికే జంక్ ఫుడ్ పిల్లలకు విషంతో సమానమని, తల్లులు తమ చేతులతో వండిన నాణ్యమైన ఆహారాన్నే పిల్లలకు అందించాలని పిలుపునిచ్చారు.గర్భిణీ స్త్రీలు బాలింతలు రోడ్ల మీద దొరికే ఆహారాన్ని కాకుండా, ఎలాంటి పురుగుమందులు లేని, కల్తీ లేని పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల తల్లితో పాటు బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.పిల్లలకు చిన్న వయసులోనే సెల్ ఫోన్లు అలవాటు చేయడం వల్ల వారి కంటి చూపు దెబ్బతినడమే కాకుండా, మానసిక వికాసం కుంటుపడుతుందని, తల్లిదండ్రులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు.“అమ్మ మాట – అంగన్వాడీ బాట“ అనే నినాదంతో ప్రతి అంగన్వాడీ సెంటర్ ద్వారా నాణ్యమైన ఆహారం అందించడమే కాకుండా, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ డిపార్ట్‌మెంట్ నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా నిత్యం వివిధ సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్ కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చడం కోసం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద, ప్రయాణికుల దృష్ట్యా పాత బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలని వృద్ధులు చిన్నపిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అవసరం మేరకే నీటిని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపాలిటీ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ బిక్షపతి , వైస్ చైర్పర్సన్, డిడబ్ల్యుఓ ప్రేమలత, సిడిపిఓ శిరీష, స్థానిక కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలోనే ఎన్నికల జరపాలి: ఆదూరి మారుతి రాజు

- భట్రాజు సంఘం ఎన్నికల్లో సొంత జిల్లా వారికే ప్రాధాన్యత ఇవ్వాలి
- సంఘ ఐక్యతను చెడగొట్టే వారిపై చర్యలు చేపట్టండి
- సొంత జిల్లాలో ప్రాధాన్యత లేని వారికి వేరే జిల్లాలో ప్రాధాన్య ఎలా ఇస్తారు
- కుల సంఘ పెద్దలు మౌనం విడాలి
- సంఘ అభివృద్ధికై అందరూ పాటుపడాలి
- ప్రజా పాలనలో ఉన్నామా రాజరికపాలలో ఉన్నామా



**సంగారెడ్డి ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ భట్రాజు సంఘం జిల్లా ఎన్నికలు రసవత్తరంగా మారాయని తెలంగాణ భట్రాజు సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ నెంబర్ ఆదూరి మారుతీ రాజు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాల వారీగా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించకుండా ఎన్నికలు నిర్వహించడం, జిల్లాలకు సంబంధంలేని వ్యక్తులకు ఇతర జిల్లాలో పోటీ చేయడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎన్నికల నిర్వహించకుండా బీరంగూడ లో నిర్వహించడం జిల్లాకు సంబంధం లేని వారిని ప్రోత్సహిస్తున్న వారి పై సంఘ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని, సంగారెడ్డి జిల్లా ఎన్నికల్లో ఇతర జిల్లాల వ్యక్తులు పోటీ చేయొద్దని ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్ర నాయకత్వం ఈ విషయం పై నిర్ణయం తీసుకోవాలని అలా జరగని పక్షంలో ఇతర జిల్లా వ్యక్తులకు ఏ జిల్లాలోనైనా పదవులు ఇస్తామంటే ఊరుకునే ప్రసక్తే లేదని, ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఏ జిల్లా వ్యక్తులు ఆ జిల్లాలోని పోటీ చేయాలని బైలాలో ఉన్న వివిధ విధానాలు తప్పకుండా పాటించాలని, ప్రజా పాలనలో ఉన్నామా రాజ్యాంగ పాలనలో ఉన్నామా అని ప్రశ్నించారు. అలా కాదని ఏకపక్ష నిర్ణయం తీసుకుంటే న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని అవసరమైతే న్యాయస్థానం వరకైనా వెళ్తామని ఈ సందర్భంగా మారుతి రాజు అన్నారు.

## అనుమతి లేకుండా బోర్‌వెల్ తవ్వకాలు జోరుగా అధికారులు ఎక్కడ?



**ములుగు జిల్లా, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** ఏటూరు నాగారంమండల పరిధిలోని కన్నయ్యగూడెం, మంగపేట, రాజపేట గ్రామాల చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుమతి లేకుండా బోర్‌వెల్ తవ్వకాలు నిర్బంధం లేకుండా కొనసాగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇళ్ల సమీపంలోనే, నిర్మాణాల వద్ద భారీ యంత్రాలతో బోర్ తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకున్నట్టు ఆధారాలు కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు.స్థానికుల వివరాల ప్రకారం అనుమతి లేకుండా బోర్ తవ్వకాలు విపరీతంగా పెరుగుతున్నాయిభూగర్భ జలాల అధిక వినియోగం వల్ల నీటి మట్టం పడిపోతుందనే ఆందోళనభద్రతా నిబంధనలు పాటించకపోవడం వల్ల ప్రమాదాలకు అవకాశంప్రత్యక్షంగా గమనించిన దృశ్యాల్లో నివాస ప్రాంతాల మధ్యే బోర్ యంత్రాలు ఏర్పాటు చేసి తవ్వకాలు జరపడం ప్రజల్లో భయాందోళనకు గురిచేస్తోంది. ఇది చట్ట విరుద్ధమని, వెంటనే నిలిపివేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. **ప్రజల ప్రధాన డిమాండ్లు:** అక్రమ బోర్‌వెల్ తవ్వకాలను వెంటనే నిలిపివేయాలిబాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలిభూగర్భ జలాల సంరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి చట్టానికి విరుద్ధంగా నడుస్తున్న ఈ బోర్‌వెల్ పంప్‌సెట్ కార్యకలాపాలు ఎప్పుడు ఆగుతాయి? అధికారుల నిర్లక్ష్యం వల్ల మరిన్ని అక్రమాలు పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కఠినంగా వ్యవహరించి చర్యలు తీసుకోవాలని ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం సాకేత్ నూతన కమిటీకి కాప్రా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మద్దతు



**కాప్రా ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ కాప్రా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ గారు, పార్టీ నాయకులతో కలిసి సాకేత్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షులు బైరి నవీన్ గౌడ్ మాట్లాడుతూ, కాలనీల అభివృద్ధిలో రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానిక సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేయాలని కమిటీ సభ్యులను ప్రోత్సహించారు.సాకేత్ కాలనీలో పారిశుధ్యం, రోడ్లు, తాగునీటి వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ పూర్తి సహకారం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ నివాసులు, యువకులు పాల్గొని నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్, పార్టీ నేతలు

**• మృతుడి కుటుంబానికి ఎంఐఎం పార్టీ ద్వారా 20వేలు, ఇంటి ఓనర్ ద్వారా 2లక్షల ఆర్థిక సాయం**



**కరీంనగర్ టౌన్ ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** బీహార్ రాష్ట్రంలోని సిపోల్ జిల్లా బలువ బజార్ ఠానా పరిధిలోని మధుబని గ్రామానికి చెందిన నివాసి, ముంతాజ్ ఆలం (38) అనే టైల్స్ కార్మికుడు కరీంనగర్ పట్టణంలో ని ముకరంపుర ప్రాంతంలో తన కుటుంబంతో సహా వచ్చి నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం కరీంనగర్ సవారణ్ స్ట్రీట్ లోని ఒక డాక్టర్ నివాసంలో రోజువారిగా టైల్స్ పరిచే పనికి వెళ్లగా సాయంత్రం 4గంటల ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు అనుమాదాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసబద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, బీహార్ రాష్ట్ర ఎంఐఎం అధికార ప్రతినిధి అడ్వకేట్ ఆదిల్ హసన్ సూచనల మేరకు ఈసమాచారం అందుకున్న వెంటనే, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, 59వ డివిజన్ ముకరంపుర కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ముంతాజ్ ఆలం మృతికి గల కారణాలను తెలుసుకొని కరీంనగర్ 2వ పట్టణ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేయించి, బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. మృతుడు పని చేస్తున్న ఇంటి ఓనర్ తో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ.2లక్షలు సాయం అందించే విధంగా కృషి చేశారు. ఇంతేగాక ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రూ.10వేల నగదును, గోదాంగడ్డకు చెందిన సోషల్ వర్కర్ అబ్దుల్ గఫ్ఫార్ లయన్ రూ.10వేల నగదును వేర్వేరుగా ఆర్థిక సాయం అందించి, మానవతకు మారుపేరుగా నిలిచారు. పోస్టుమార్టం నిర్వహించి, ట్రాన్స్ఫర్టు డెత్ సర్టిఫికెట్ ను పోలీసులతో వ్రాయించి, బీహార్ రాష్ట్రంలోని మృతుడి స్వంత గ్రామం వరకు మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ను మాట్లాడి, మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లే ఏర్పాటు చేశారు. గత రాత్రి నుంచి ఈరోజు మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి ఈ కార్యక్రమాన్ని పూర్తి గావించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ అంశానికి సంబంధించిన పూర్తి సమాచార వివరాలను బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి, బీహార్ రాష్ట్ర ఎంఐఎం అధికార ప్రతినిధి ఆదిల్ హసన్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు గులాం అహ్మద్ తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, గోదాం గడ్డ సోషల్ వర్కర్ అబ్దుల్ గఫ్ఫార్ లయన్, ముకరంపుర ఎంఐఎం నాయకులు తఫజ్జుల్ రహమాన్, హాఫిజ్ హైదర్,తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు సిబ్బందికి మజ్జిగ పంపిణీ

**• శాంతినగర్ పెద్దల సేవా స్ఫూర్తికి అభినందనలు**



**కల్లూరు, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి సందర్భంగా కల్లూరు నూతన బస్టాండ్‌లో శాంతినగర్ పెద్దల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తీవ్ర ఎండల నేపథ్యంలో ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసి సేవా భావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో శాంతినగర్ పెద్దలు, మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ వెంగళ వెంకటేశ్వర్లు, వరదయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మహాత్మ జ్యోతిబా పూలే ఆలోచనలు, సేవలు గుర్తు చేసుకుంటూ సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. ఎండలతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేయడం వల్ల వారికి తాత్కాలిక ఉపశమనం లభించిందని పలువురు ప్రయాణికులు తెలిపారు. ఈ సేవా కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా టీం సత్తుపల్లి తరఫున ప్రయాణికుల తరఫున శాంతినగర్ పెద్దలకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. సమాజ సేవలో ఇలాంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని కోరారు.

# అణగారిన వర్గాల అభ్యున్నతికి, విద్యాభివృద్ధికి మహాత్మా జ్యోతిరావు పూలే కృషి

**• పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం**

**• కొత్తూరు(సి)గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని**



**కురవి ఏప్రిల్ 11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని కురవి మండలం కొత్తూరు (సి) గ్రామ సర్పంచ్ బాదావత్ చిన్ని అన్నారు. నేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బాదావత్ చిన్ని సిరి నాయక్ మాట్లాడుతూ మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. సామాజిక ఉద్యమాలు నడిపి నిస్వార్థంగా సామాజిక వికాసానికి విలువలు నేర్పుతూ మార్గదర్శిగా నిలిచారన్నారు. సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసు కున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని సర్పంచ్ చిన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్ పగడాల క్రిష్టారెడ్డి. ఇందిరమ్మ కమిటీ సభ్యులు మలిశెట్టి వేణు. పంచాయతీ కార్యదర్శి జానీపాషా. పంచాయతీ సిబ్బంది మాచర్ల సైదులు. వెంకటమ్మ. స్థానికులు అరవింద్. సౌడం చింటూ. కందుల దశరథ. ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు..

# ప్రజా ప్రభుత్వంతో సాకారమైన సొంతింటి కల

**• పేరువంచ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం లబ్ధిదారుల్లో ఆనందం**

**కల్లూరు, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలోని పేరువంచ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కోట నాగమణి కి ఎంతోకాలంగా ఉన్న సొంత ఇంటి కల ప్రజా ప్రభుత్వ సహకారంతో నెరవేరింది. ఇటీవల ఆమె కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ గృహంలో గృహప్రవేశ కార్యక్రమం నిర్వహించగా, శనివారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కిసర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కల సాకారానికి కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతల్లో అందిస్తూ పేదల ఆత్మగౌరవాన్ని పెంచుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక ఇళ్ల నిర్మాణాలు పూర్తవుతూ లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ అవుతున్నాయని చెప్పారు. లబ్ధిదారులు కోట నాగమణి, కిసర అనిత తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కీసర మధుసూదన్ రెడ్డి, కేసరి శ్రీనివాస్ రెడ్డి, పాశం అప్పయ్య, ఇనపాల రామారావు, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, రాఘవరెడ్డి, ఆవల ఏసు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# దేశంలోనే మొదటి స్థానంలో కోనేరుపల్లె గ్రామం




**గంగాధర ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజక వర్గంచొప్పదండి మండలంలోని కోనేరుపల్లె గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు జాతీయ స్థాయిలో ప్రథమ బహుమతి గెలుచుకోగా వారిని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మేడిపల్లి సత్యం గారు శాలువాతో ఘనంగా సత్కరించారు. భారత గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడానికి, దేశంలోని 1.5 లక్షలకు పైగా ఉన్న గ్రామ సర్పంచులను అనుసంధానిస్తూ ఒకే వేదికపైకి తెచ్చే క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన సర్పంచ్ సంవాద్ యాప్ ద్వారా మార్చి నెలలో భారత ప్రభుత్వం ఇచ్చిన "క్రీడా మిత్ర పంచాయతీ " ప్రణాళికలో భాగంగా గ్రామంలోని యువతని క్రీడలవైపు మళ్ళించే విధంగా కృషిచేసి వారితో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన జవీ కప్ పోటీలలో పాల్గొనే విధంగా ప్రోత్సహించి రూపొందించిన వీడియోకు గాను కోనేరుపల్లె సర్పంచ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచి 35 వేల రూపాయల బహుమతి గెలుచుకుని చొప్పదండి నియోజకవర్గంతో పాటు, కరీంనగర్ జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చినందుకుగాను సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ గజ్జెల తిరుపతి, పాలకవర్గ సభ్యులు, ఎంపిడిఓ వేణుగోపాల్ రావు, ఎంపివో రాజగోపాల్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ లను అభినందించారు. ఈ సందర్భంగా కోనేరుపల్లె గ్రామ పాలకవర్గం అన్ని విధాలుగా సహకరిస్తున్న ఎమ్మెల్యే సత్యం కి ధన్యవాదాలు తెలిపారు . కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆనందమే ప్రభుత్వ ధ్యేయం

**• కార్పొరేటర్ పాలెపు వెంకటరమణ**

**• పేద మహిళల ముఖాల్లో చిరునవ్వులు పూయించిన ఇందిరమ్మ చీరల పంపిణీ**

**• 44వ డివిజన్‌లో 2 వేల మంది మహిళలకు చీరల అందజేత**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహిళల ఆనందమే ప్రభుత్వ ధ్యేయమని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు వెంకటరమణ అన్నారు. పేద మహిళల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం శనివారం 44వ డివిజన్‌లో హృదయాన్ని హత్తుకునే వాతావరణంలో జరిగింది. డివిజన్ పరిధిలోని బస్ డిపో రోడ్‌లో గల లెనిన్ నగర్‌లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పాలెపు వెంకటరమణ మాట్లాడుతూ... ప్రభుత్వం ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలు చేస్తూ పేద మహిళల జీవితాల్లో సంతోషాన్ని నింపడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళల ముఖాల్లో కనిపిస్తున్న ఆనందం తమకు మరింత సేవ చేసేందుకు ప్రేరణనిస్తోందన్నారు. డివిజన్‌లో సుమారు 2 వేల మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం ద్వారా ప్రభుత్వం సామాజిక బాధ్యతను చాటుకుందని ఆయన అన్నారు. ఈ చీరలు కేవలం వస్త్రాలు కాకుండా, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. చీరలు అందుకున్న మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం మొత్తం ఉత్సాహభరితంగా సాగి, మహిళల ముఖాల్లో చిరునవ్వులు పూయించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సతీమణి విజయ, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్ రెహనాబేగం, ఆర్.పి.లు పాతిమా, పర్వీన్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడు కల్లూరు నియోజకవర్గం సాధనకై సన్నాహక సమావేశం

**కల్లూరు, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కల్లూరు లోని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం నందు ఆదివారం ఉదయం 10.30 నిమిషాలకు ఏర్పాటు చేయడం జరిగిందని నియోజ కవర్గ సన్నాహక సాధన కమిటీ తెలిపింది. ఈ సమావేశానికి రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజాస్వామ్యవాదులను, పలు రాజకీయ పార్టీల నాయకులను కార్మిక సంఘాల నాయకులను, ప్రజా ప్రతినిధులను, ఆహ్వానిస్తున్నాం అని తెలిపారు. సదరు కార్యాచరణ సమావేశానికి తప్పనిసరిగా పాల్గొని విజయవంతం చేయగలరని కల్లూరు నియోజకవర్గం సన్నాహక సాధన కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు.

# పూలే ఆశయాలు, కార్యాచరణ నేటికీ స్ఫూర్తిదాయకం

**- చింతపల్లి గ్రామ సర్పంచ్ దీరవత్ వీరన్న**



**మహబూబాబాద్ జిల్లా సీరోల్ ఏప్రిల్ 11(పి.సి.డబ్ల్యూ న్యూస్):** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని కురవి మండలం చింతపల్లి గ్రామ సర్పంచ్ దీరవత్ వీరన్న అన్నారు. నేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పూలే జయంతి సంధర్భంగా అయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వీరన్న మహిళా విద్య, దళిత, బడుగు వర్గాల హక్కులకు, కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని తెలిపారు. సామాజిక ఉద్యమాలు నడిపి నిస్వార్థంగా సామాజిక వికాసానికి విలువలు నేర్పుతూ మార్గదర్శిగా నిలిచారన్నారు. సమ సమాజ నిర్మాణంలో జ్యోతిరావు పూలే కీలక పాత్ర పోషించారని గుర్తుచేసుకున్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పూలే ఆశయ సాధనకు కృషి చేయడమే మనం అర్పించే ఘన నివాళి అని సర్పంచ్ వీరన్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి గండు వినోద్ కుమార్, మడ్డి వీరన్న, బిపిఎం పవన్ కుమార్, దొంతగాని నరేష్, యమ్మగాని వెంకన్న, భుక్య వెంకన్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర జ్ఞానమే సమాజ మార్పుకు శక్తి

**- భావోద్వేగభరితంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు**

**- పెన్షనర్స్ భవన్‌లో ఘనంగా జయంతి సభ పూలే సేవలకు నివాళులు**

**- విద్యతోనే సమానత్వం సాధ్యం**

**- రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య, తాళ్ళూరి వేణు**






**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో అజ్ఞానాన్ని తొలగించి సమానత్వాన్ని నెలకొల్పేందుకు అక్షర జ్ఞానం ఎంత అవసరమో చాటిచెప్పిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం సుబ్బయ్య, తాళ్ళూరి వేణు లు అన్నారు. శనివారం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు ఖమ్మంలో హృదయాన్ని హత్తుకునేలా ఘనంగా నిర్వహించారు. స్థానిక పెన్షనర్స్ భవన్‌లో జరిగిన ఈ సభలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పూలే గొప్పతనాన్ని స్మరించుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ళూరి వేణు మాట్లాడుతూ... 'అక్షరమే ఆయుధం' అనే నమ్మకంతో జీవితాన్ని అంకితం చేసిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. దేశంలో సామాజిక చైతన్యానికి నాంది పలికిన ఆయన, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని తన కార్యాచరణతో నిరూపించారని తెలిపారు. సమాజంలో మహిళలకు విద్య అందించాలనే సంకల్పంతో సావిత్రిబాయి పూలేను దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్దిన మహత్తర కృషి పూలే చేసినదని గుర్తుచేశారు. ఆ కాలంలో ఎదురైన అనేక అవరోధాలను అధిగమించి సమాన హక్కులకోసం పోరాడిన ఆయన సేవలు తరతరాలకు మార్గదర్శకమని అన్నారు. సభ ప్రారంభంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ, సమాజంలో ఇంకా ఉన్న అసమానతలను తొలగించేందుకు ప్రతి ఒక్కరూ విద్యను ఆయుధంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. పూలే ఆలోచనలు నేటికీ ప్రాసంగికమని, ఆయన చూపిన మార్గంలో నడవడం ద్వారా సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమం మొత్తం పూలే ఆశయాలను స్మరించుకుంటూ, సమాజ సేవ పట్ల మరింత నిబద్ధతను పెంపొందించేలా సాగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఎం సుబ్బయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ పూర్ణచంద్రావు, ఆర్థిక కార్యదర్శి వెంకట్ నారాయణ, కార్యదర్శులు టీ జనార్ధన్, ఖాజా మొయినుద్దీన్, నగర శాఖ నాయకులు జి ఆదినారాయణ, రాధాకృష్ణ, కృష్ణారావు, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రమణ యాదవ్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జికే చైతన్య భూమిలో బడుగుల బాపు జ్యోతి బా పూలె జయంతి ఉత్సవాలు

**మరుపు రాని మహాత్ముడు జ్యోతి రావ్ పూలే**

**ముఖ్య అతిధి : పోతారాజు రాములు**

**అధ్యక్షులు ఆర్ జి కే డెవలప్మెంట్ అసోసియేషన్**




**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, ఏప్రిల్ 11(పిసిడబ్ల్యూ న్యూస్) :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ దమ్మాయి గూడ డివిజన్ లోని అర్జీకే చైతన్య భూమి వద్ద రాజీవ్ గృహ కల్ప మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతి బా పూలె 199 వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా పోతారాజు రాములు రాజీవ్ గృహ కల్ప డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు హాజరై మహాత్మా జ్యోతి రావ్ పూలె, డాక్టర్,, బి ఆర్ అంబెడ్కర్ లకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అయన మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావ్ పూలె 1827–1890, 19 వ శతాబ్దపు భారతీయ మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక సంస్కర్త, కుల వ్యతిరేక ఉద్యమకారుడు మరియు విద్యావేత్త. స్త్రీ విద్య, దళిత బహుజనుల హక్కులు, మరియు అస్పృశ్యతా నిర్మూలన కోసం పోరాడారు. 1848లో పూణేలో బాలికల కోసం దేశంలోనే మొదటి పాఠశాలల్లో ఒక దానిని తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి స్థాపించారు అందుకే మరుపు రాని మహాత్ముడు జ్యోతి రావ్ పూలె అని అని అఅంటూ ఇంత గొప్ప కార్యక్రమనికి నన్ను ఆహ్వానించడం చాలా ఆనందంగా ఉన్నది అన్నారు. మాల మహా నాడు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్షులు గుజ్జుక పర్శురాం,మాల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు మోతె రాజేంద్ర ప్రసాద్, పాడుగుల రూప చంద్రమౌళి, సలహాదారులు అబ్బులు, కోశాధికారి చెన్నయ్య, వర్కింగ్ ప్రసిడెంట్ కోలాటి రాజు,వినాయక రావ్,శ్రీనివాస్, జనార్దన్, పాల్గొన్నారు.

### జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి

# ఘనంగా నివాళులర్పించారు


- నూతన కార్యదర్శి రబ్బాని, సర్పంచులు విసం పల్లి కవితా బాలకృష్ణ.



**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 11 (పీసిడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని గుర్తుర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా గ్రామ సర్పంచ్ కవిత బాలకృష్ణ జ్యోతిరావు పూలే చరిత్రను వివరించారు.ఏప్రిల్ 1827 – 28 నవంబర్ 1890) 19వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ సామాజిక సంస్కర్త, విద్యావేత్త మరియు సంఘసేవకుడు. మహారాష్ట్రలో జన్మించిన ఆయన, కుల వివక్ష, అంటరానితనం, మరియు స్త్రీ విద్య కోసం పోరాడారు. భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి మహిళల కోసం తొలి పాఠశాలను స్థాపించి, స్త్రీ, దళిత విద్యా వికాసానికి బాటలు వేశారు. వారి జననం 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలోని సతారా జిల్లాలో, మాలి కులానికి చెందిన కుటుంబంలో జన్మించారు.సామాజిక స్పృహ: చిన్నతనంలో ఎదురైన కుల వివక్ష ఆయనను సంఘ సంస్కర్తగా మార్చింది.సత్యశోధక సమాజ్: 1873లో కుల నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం 'సత్యశోధక సమాజ్' (సత్య శోధక సమాజం) స్థాపించారు.స్త్రీ విద్య: 1848లో పూణేలో బాలికల కోసం మొదటి పాఠశాలను స్థాపించారు. సామాజిక సేవలను గుర్తించి, 1888లో ఆయనకు 'మహాత్మా' బిరుదు ప్రదానం చేశారు.స్త్రీల సాధికారత, దళితుల హక్కుల కోసం ఆయన చేసిన కృషి భారతీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర జ్యోతీరావ్ ఫులే సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు, మహారాష్ట్రకు చెందిన సామాజిక కార్యకర్త విఠల్‌రావు కృష్ణజీ వందేకర్ , 1888 మే 11న ఫూలేకు 'మహాత్మా' అనే బిరుదును ప్రదానం చేశారు. ఆయన చేసిన కృషి ప్రధానంగా అంటరానితనం...ఆధునిక యుగ వైతాళికుడు మహాత్మా పూలే శూద్ర, అతిశూద్ర వర్గాలకు తరగని దన్నుగా నిలిచాడు. దేశ ప్రప్రథమ సామాజిక తత్వవేత్త, గాంధీ కంటే ముందే మహాత్మునిగా జన నీరాజనాలందుకున్న గొప్ప వ్యక్తి అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలకృష్ణ తో పాటు కారోబార్ వేణు వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# సంఘసంస్కర్త, సామాజిక తత్వవేత్త, తరతరాలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే...





**- జయంతి వేడుకల్లో బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి.**

**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూన్యూస్):** భారతదేశ అగ్రశ్రేణి సంఘసంస్కర్త, సామాజిక తత్వవేత్త , తరతరాలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే అని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి కొనియాడారు.బిజెపి ఓబీసీ మోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో, కరీంనగర్ లోని కోతిరంపుర్ లోని మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వారి పూల మాలలు వేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సామాజిక ఆసమానతలు తొలగించి, దీన జనుల జీవితాలలో వెలిగి నింపిన గొప్ప సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే అని తెలిపారు. ముఖ్యంగా కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు, స్త్రీలు చదువుకోవాల్సిందేనని పట్టు పట్టి ప్రత్యేక స్కూల్ ఏర్పాటుచేసిన గొప్ప నేత మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు. బడుగు బలహీన పీడిత వర్గాలకు ఎల్లప్పుడూ అండగా నిలిచి చరిత్రలో నిలిచిపోయిన పోరాటయోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అన్నారు, ప్రధానంగా మహాత్మా జ్యోతిరామహాత్మా భౌతికంగా ప్రపంచాన్ని వదిలి 136 ఏళ్లయినా బడుగుల మేలు కోసం పూలే పడిన ఆరాటం ఇప్పటికీ స్ఫూర్తిని పంచుతుందన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్తే కాదు నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావానికి ఆయన జీవితం నిలువుటద్దంలా నిలుస్తుందన్నారు. దేశానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా పూలే సేవలను దేశం స్మరించుకుంటుందన్నారు. ఆ మహనీయుని జయంతి సందర్భంగా బిజెపి జిల్లా శాఖ పక్షాన మహాత్మ జ్యోతిరావు పూలే కు ఘన నివాళులు అర్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. పూలే అడుగుజాడల్లో, ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని ముందు కొనసాగాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ మేయర్ కోలగానీ శ్రీనివాస్ , డిప్యూటీ మేయర్ సునీల్ రావు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిలు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ ,మాడ వెంకట్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, ఓబిసి మోర్చ జిల్లా అధ్యక్షులు దులం కళ్యాణ్ కార్పొరేటర్ లు బోయినపల్లి ప్రవీణ్ రావు ,ఎన్నాశీ ప్రకాష్ ,బండ రమణ రెడ్డి, మాసం గణేష్ , ఏపీపీ చంద్ర, .సౌగాని కొమురయ్య, కర్రె అనిల్ ,చొప్పరి జయశ్రీ ,దేశి శిల్పా, తాటి ప్రభావతి, పెద్దపల్లి శ్రీలేఖ, నాంపల్లి శ్రీనివాస్, పొన్నం మొండయ్యా, జోన్ కన్వీనర్ లు తణుకు సాయికృష్ణా, జాడి బాల్ రెడ్డి ,పాదం శివరాజ్ ,అవుదుర్తి శ్రీనివాస్ , ఆకుల రాజేందర్, గుజ్జ శ్రీనివాస్, అడి చేర్ల రాజు, పెద్దపల్లి జితేందర్ ,గుంజేటి శివ కుమార్, వెంకట రమణ, బల్బీర్ సింగ్ ,కచ్చా కాయల రాజు పాల్గొన్నారు.

# దేశంలో అక్షరదీపం వెలిగించిన మహనీయుడు పూలే

- **ఘనంగా మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతి**
- **టీజీఎస్ ఆర్టీసీ ఖమ్మం నూతన బస్టాండ్‌లో ఘనంగా పూలే జయంతి వేడుకలు**
- **మహిళా విద్య, సామాజిక న్యాయం కోసం పూలే చూపిన మార్గం ఆదర్శం**



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో అజ్ఞానం, అసమానతలపై అక్షర దీపం వెలిగించిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని డిపో మేనేజర్ మేడా శివప్రసాద్ అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే 199వ జయంతి వేడుకలు ఖమ్మం నూతన బస్టాండ్‌లోని టీజీఎస్ ఆర్టీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం డిప్యూటీ రీజనల్ మేనేజర్ వి. మల్లయ్య అధ్యక్షతన భావోద్వేగభరితంగా సాగింది.ఈ సందర్భంగా డిపో మేనేజర్ మేడా శివప్రసాద్, మెడికల్ ఆఫీసర్ కుమారి సాయి సుస్మా, సూపర్వైజర్లు, సిబ్బంది, సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ సిబ్బంది, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళా విద్యకు పునాది వేసి, సమానత్వ సమాజ నిర్మాణానికి మార్గం చూపిన గొప్ప సామాజిక సంస్కర్త పూలే అని కొనియాడారు. కులవ్యవస్థ నిర్మూలన, విద్య విస్తరణ కోసం ఆయన చేసిన కృషి నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఆయన ఆశయాలు ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచే సత్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు పూలే ఆశయాలను తమ జీవన విధానంలో అనుసరించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకలు కేవలం జయంతి కార్యక్రమంగా కాకుండా, సమాజానికి సేవ చేయాలనే బాధ్యతను మరింతగా గుర్తు చేసిన సందర్భంగా నిలిచాయి. ఈ కార్యక్రమం మొత్తం పూలే మహనీయుని స్ఫూర్తిని స్మరించుకుంటూ, సమానత్వం, మానవత్వం పట్ల నిబద్ధతను పెంపొందించేలా సాగింది.



# ప్రజల ఆరోగ్యానికి ప్రకృతి పరిమళం







**- మేయర్ పూనకొల్లు నీరజ**

**- కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా ప్రారంభం**

**- పెవిలియన్ గ్రౌండ్‌లో మేయర్ పూనకొల్లు నీరజ చేతుల మీదుగా ఘన ప్రారంభం**

**- రసాయన రహిత పండ్లతో ఆరోగ్య సంరక్షణ**

**- రైతు లక్ష్మణ్ నాయక్ సేవలకు ప్రశంసలు**




**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజల ఆరోగ్యానికి ప్రకృతి పరిమళం కార్బైడ్ రహిత మామిడి పండ్లని ఖమ్మం మేయర్ పూనకొల్లు నీరజ అన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో కార్బైడ్ రహిత మామిడి పండ్ల మేళా ఖమ్మం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో శనివారం హృద్యమైన వాతావరణంలో ప్రారంభమైంది. మేయర్ పూనకొల్లు నీరజ ఈ మేళాను ప్రారంభిస్తూ, ప్రకృతి పద్ధతుల్లో పండించిన పండ్ల వినియోగం చిన్న పిల్లల దగ్గర నుండి వృద్ధుల వరకు ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రసాయనాల వినియోగం పెరుగుతున్న ఈ కాలంలో కార్బైడ్ రహిత పండ్లను ప్రజలకు అందించడం ఆరోగ్య పరిరక్షణలో కీలకమైన అడుగని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, సహజ పద్ధతుల్లో పండించిన ఆహారాన్ని ఎంచుకోవాలని ఆమె సూచించారు. ఈ మేళాలో పాల్గొన్న ఉత్తమ రైతు అవార్డు గ్రహీత బాణోత్ లక్ష్మణ్ నాయక్‌ను మేయర్ ప్రత్యేకంగా అభినందించారు. గత 14 సంవత్సరాలుగా కార్బైడ్ రహిత మామిడి పండ్లను ప్రజలకు అందిస్తూ విశ్వాసాన్ని గెలుచుకున్న ఆయన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజల ఆరోగ్యాన్ని ముందుంచుకొని నిస్వార్థంగా కృషి చేస్తున్న రైతులు సమాజానికి మార్గదర్శకులని పేర్కొన్నారు.మేళాకు వచ్చిన ప్రజలు సహజసిద్ధమైన మామిడి పండ్లను ఆస్వాదిస్తూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. 'మా కుటుంబ ఆరోగ్యం కోసం ఇలాంటి పండ్లే కావాలి' అంటూ పలువురు కొనుగోలుదారులు అభిప్రాయపడ్డారు. ఈ మేళా రైతులకు ప్రోత్సాహాన్ని, వినియోగదారులకు నమ్మకాన్ని అందించే వేదికగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమం మొత్తం ఆరోగ్య సందేశాన్ని పంచుతూ, ప్రకృతి పట్ల ప్రేమను మరింత బలపరిచిందన్నారు. ఈ కార్యక్రమంలో పాలెపు విజయ, ఉద్యానశాఖ అధికారి అనితశ్రీ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాలో ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలు

**• జిల్లాలో వెంటనే జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి : తోటకూరి శ్రీకాంత్ గౌడ్**






**ములుగు జిల్లా మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్)** మహాత్మా జ్యోతిబా పూలే జయంతి ఉత్సవాలు ములుగు జిల్లాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తోటకూరి శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహాత్మా జ్యోతిబా పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడి ఆలోచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. అయితే ములుగు జిల్లాలో ఇప్పటివరకు మహాత్మా జ్యోతిబా పూలేకు శాశ్వత విగ్రహం లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన విమర్శించారు. జిల్లాలోని ప్రధాన కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అణగారిన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడి స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శంగా నిలవాలని, అందుకు విగ్రహం స్థాపనతో పాటు స్మారక కార్యక్రమాలు కూడా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యవసరంగా పరిగణించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాసంఘాల నాయకులు, మేధావులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**• సామాజిక సమానత్వానికి పూలే మార్గదర్శి: మున్సిపాలిటీ చైర్మన్ మోహన్**



**కల్లూరు, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి సందర్భంగా కల్లూరు పట్టణంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధరావత్ మోహన్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబా పూలే సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం పూలే చేసిన పోరాటం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని అన్నారు. వారి ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, ఖమ్మంపాటి రాధా వీరస్వామి, మాజీ వార్డు సభ్యులు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సుధీర్, మేకతొట్టి పుల్లయ్య, కొండూరు కిరణ్ కుమార్, బైర్ల కాంతారావు, దామల రాజు, వేము దినాకర్, జంగం నరసింహారావు, మేకల కృష్ణ, వెంగల వెంకటేశ్వర్లు, ఖమ్మంపాటి బాబురావు, ఖమ్మం పాటి వెంకటేశ్వర్లు, మాతిపోగు వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ ఖమ్మంపాటి పుల్లారావు, ధరావత్ రవి కుమార్, మోదుగు రమేష్, భాస్కరరావు స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో హాజరై మహాత్మ పూలే కు ఘన నివాళులు అర్పించారు.

# సింగరేణి ఏరియాలో ఘనంగా మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు







**సత్తుపల్లి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సామాజిక విప్లవకారుడు, వెనుకబడిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు సత్తుపల్లి సింగరేణి ఏరియాలో ఘనంగా నిర్వహించబడ్డాయి. శనివారం ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధికారులు, సింగరేణి బిసి, ఓబీసీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కార్మికులు హాజరై నివాళులర్పించారు. జీఎం కార్యాలయం లో ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సమానత్వం కోసం, ముఖ్యంగా అణగారిన వర్గాల విద్యా సాధికారత కోసం పూలే చేసిన కృషి అమోఘమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ, జిఎం బొల్లం శ్రీనివాస్, బి.సి. లైజన్ ఆఫీసర్ బుడగం రామకృష్ణ, వివిధ బి.సి. అసోసియేషన్ సభ్యులు, యూనియన్ డెలిగేట్లు, అధికారులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో వేడుకలుజేవియర్ ఓసి-2 గనిపై ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్.వి.ఆర్. ప్రహ్లాద్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కిష్టారం ఓసి-2 గనిపై ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.ఎల్.ఎస్.వి. సునీల్ వర్మ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. జేవియర్ సిహెచ్ పి వద్ద హెచ్.ఓ.డి కె సోమశేఖర రావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించబడింది. జేవిఆర్ డిస్పెన్సరీ లో డిప్యూటీ సి.ఎం.ఓ డాక్టర్ నరసింహారావు అధ్యక్షతన పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జ్యోతిబా పూలే ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని, ఆయన చూపిన బాటలో నడవడమే మనం ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో ఏరియాలోని అన్ని విభాగాల అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హిందువుల ఐక్యత జాతీయ సమైక్యతకు, దేశ రక్షణకు, సామాజిక సామరస్యానికి పునాది..

**• ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ జి....**






**తిమ్మాపూర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూన్యూస్):** హిందువుల ఐక్యత, జాతీయ సమైక్యతకు, దేశ రక్షణకు, సామాజిక సామరస్యానికి పునాది లాంటిదని ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ జి అన్నారు. తిమ్మాపూర్ ఖండ పర్లపల్లి ఉప మండలం, శ్రీ సీతారామ లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం రోజున నల్లగొండలో హిందూ సమ్మేళనం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యత అనేది సనాతన ధర్మ పరిరక్షణకు, సామాజిక బలపరిస్థితికి అత్యంత ఆవశ్యకమన్నారు. కుల, ప్రాంతీయ విభేదాలను విస్మరించి, హిందువులందరూ ఒకే కుటుంబం గా భావించి, హిందూ ధర్మం, ఆధ్యాత్మిక విలువలు, సంస్కృతిని కాపాడుకోవడం ద్వారా ఐక్యత సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఏర్పడి 100 సంవత్సరాల అవుతుందని, వందేళ్లు ఆర్ఎస్ఎస్ నిరంతరం దేశ హితం, మాతృభూమి సేవ కోసం, హిందూ సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసమే పనిచేసిందన్నారు. వందేళ్ళ ఉత్సవాలలో భాగంగా నేడు పంచ పరివర్తన్ దిశలో సమాజంలోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సామాజిక సమరత, మన సంస్కృతి సాంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్, పౌర నియమావళి అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకు వెళ్లేలా నేడు సంఘం పనిచేస్తుందన్నారు. జిల్లా సామాజిక సమరత మహిళా సహ ప్రముక్ తిపర్తి రమాదేవి, వేద పండితులు, పురోహితులు ఊరుమడ్ల శ్రీనివాస శర్మ,, సంకసానంద సరస్వతి స్వామి జీ లు మాట్లాడుతూ సనాతన ధర్మం, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. విదేశీ ప్రభావాలను ఎదుర్కొనేందుకు సమాజంలో ఐక్యత అత్యంత అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థో వైద్యులు శ్రీనివాస్, సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు ఖండ కర్యవహ కుమార్, ఖండ కార్యకారిణి, ఉప మండల ప్రముఖులు, మర్క హరికృష్ణగౌడ్, డి. ప్రదీప్, ఉత్సవ సమితి బాధ్యులు లతోపాటు వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# తిమ్మాపూర్ ఉప మండలం హిందూ సమ్మేళనం ఈనెల18న...

**- శ్రీ అనంతపద్మనాభ స్వామి ఉత్సవ సమితి పేరిట కమిటీ ఏర్పాటు...ఆహ్వాన పత్రిక, గోడ ప్రతి ఆవిష్కరణ...**



**తిమ్మాపూర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** తిమ్మాపూర్ ఉప మండలం (అలుగునూరు, మహాత్మ నగర్, తిమ్మాపూర్, పోరండ్ల, రామకృష్ణ కాలనీ, ఇందిరానగర్, నుస్తులాపూర్, కొత్తపల్లి) గ్రామాల హిందూ సమ్మేళనం ఈనెల 18వ తేదీ, శనివారం రోజున సాయంత్రం ఐదు గంటలకు రామకృష్ణ కాలనీ గ్రామపంచాయతీ సుభాష్ నగర్ పరిధిలోగల శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయ ప్రాంగణం , అంగారిక టౌన్ షిప్ వద్ద నిర్వహించనున్నారు. హిందూ సమ్మేళనం నిర్వహణ కోసం శ్రీ అనంత పద్మనాభ స్వామి ఉత్సవ సమితి పేరిట కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్సవ సమితి అధ్యక్షులుగా బొంతల కళ్యాణ్ చంద్ర, కార్యదర్శిగా రామగుడు సంపత్, ఉపాధ్యక్షులుగా ఆకు మడుపుల నరేంద్ర స్వరూప్, వంగల అంజిరెడ్డి , తుర్తి సంతోష్, అలువాల మనోజ్, రామిడి మహేందర్ రెడ్డి, కొత్త రాజిరెడ్డి, నాంపల్లి సత్యం, కొమ్మెర రామిరెడ్డి, కోశాధికారిగా దుర్శెటి మురళి, ప్రచార కార్యదర్శిగా కొట్టాల శ్రీనివాస్, ఉప కార్యదర్శులుగా బట్టు కర్ణాకర్, వేల్పుల నరేష్, జక్కుల కుమారస్వామి, రొడ్డ మహేష్, గంగు లక్ష్మణ్, ఓంకార్, నాంపల్లి రమణ , ఒద్నాల రాములు, ప్రోగ్రాం కోఆర్డినేటర్స్ నేదునూరి ప్రసాద్, కొత్తూరి శ్రీనివాస్, కడార్ల శ్రీనివాస్, చిందం అంజి, ఈనుగొండ అశోక్ రెడ్డి, ఎడ్ల భూమిరెడ్డి, చింతం శ్రీనివాస్, సుగుర్తి జగదీశ్వర చారి, గడ్డం అరుణ్,శేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులుగా గడప శేఖర్, వినయ్, సర్వేష్, మధు, బాలరాజు,జాప శ్రీనివాస్ రెడ్డి, వకుకలాభరణం శ్రీధర్, జక్కుల అనిల్, కడాల శ్రీను, జంగపల్లి నరసయ్య, దుర్శెట్టి అజయ్, ఎడ్ల అంజిరెడ్డి, పొన్నాల తిరుపతి, బుట్టి వెంకటేష్, ఎలుక మురళి, కుంట మల్ల ప్రేమ్ చంద్, కురాకుల స్వామి, ఎడ్ల జోగి రెడ్డి, వేల్పుల రవి, సంతోష్ రెడ్డి, సంపత్ రెడ్డి, సతీష్, వీరేందర్, రాజేందర్ , లక్ష్మయ్య, కుమారస్వామి, లక్ష్మణ్, వెల్ది అజయ్ , వెంకట్, రొడ్డ శ్రీకాంత్, పుప్పాల సురేష్, ఎదలాపురం జగదీశ్వరి, ఆవుల కీర్తి , పొలం మల్లేష్, కొమ్మెర వెంకట్ రెడ్డి, వేల్పుల పద్మ, అలువాల వెంకటేష్ , తరుణ్, వేణు చరణ్ , సుశాంత్, ఆదిత్య , సాయికుమార్, సాయి మణితేజ్, రొడ్డ అశ్రిత్, సుద్దాల సతీష్, శ్రీకాంత్, ఒద్నాల పూర్ణచందర్, గడ్డం లక్ష్మణ్, గోలి కృష్ణారెడ్డి వెల్ది విజయ్, సారదండ్ల శ్రీనివాస్ రెడ్డి, సిద్ధ చిరంజీవి, ఓదేలు, దీపిక లతోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా 8 గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఆలయ కమిటీ చైర్మన్లు , పూజారులతో హిందూ సమ్మేళన పూర్తి కమిటీని శనివారం రోజున ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు మాట్లాడుతూ హిందూ సమాజం నేడు కులం, వర్గాలుగా విడిపోయే పరిస్థితి ఉండకుండా , ఐకమత్యంతో ముందుకు కొనసాగాలనే ఉద్దేశంతో హిందూ సమ్మేళనం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. హిందూ సంస్కృతిని, సాంప్రదాయాన్ని , సనాతన ధర్మాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.సంఘం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పిలుపునిచ్చిన పంచ పరివర్తన్ కార్యక్రమాలు సామాజిక సమరత, మన సంస్కృతి సాంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ ప్రబోధన్ , పౌర నియమావళి లను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. ముఖ్యంగా సంఘ శతాబ్ది ఉత్సవాలలో భాగంగా హిందూ సమ్మేళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 18 శనివారం రోజున సాయంత్రం ఐదు గంటలకు తిమ్మాపూర్ ఉప మండలంలోని 8 గ్రామాల హిందూబంధువులందరూ కుటుంబం తో సహా హాజరై హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 11(పీసిడబ్ల్యూ న్యూస్):** పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహనీయుడు జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఘనంగా నిర్వహించారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే ప్రసంగిస్తూ జ్యోతిరావు పూలే సామాజిక సమానత్వం, విద్యా విస్తరణ కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి వారు చేసిన సేవలు దేశానికి మార్గదర్శకంగా నిలిచాయని తెలిపారు. మహిళా విద్యకు, దళితుల హక్కులకు ఆయన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. అలాగే సమాజంలో సమానత్వం, న్యాయం నెలకొల్పేందుకు జ్యోతిరావు పూలే ఆలోచనలు నేటికీ ప్రాసంగికమని, ఆయన చూపిన మార్గంలో నడవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతిరావు పూలే కు నివాళులు అర్పించారు.

# మల్లంపల్లి మండలంలో సమగ్ర భవనంలోనే ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి : బీజేపీ డిమాండ్

**• ప్రజలకు సులభ పరిపాలన కోసం ఇంటిగ్రేటెడ్ కార్యాలయ సముదాయం అవసరం : బైకాని మహేందర్ యాదవ్**



**మల్లంపల్లి మండల ప్రతినిధి ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా మల్లంపల్లి మండలంలో నూతనంగా ఏర్పడిన మండలానికి సంబంధించిన అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఒకే సమగ్ర (ఇంటిగ్రేటెడ్) భవనంలో ఏర్పాటు చేయాలని భారతీయ జనతా పార్టీ మల్లంపల్లి మండల అధ్యక్షుడు బైకాని మహేందర్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సులభమైన, వేగవంతమైన మరియు సమర్థవంతమైన పరిపాలన అందించాలంటే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండటం అత్యవసరమని అన్నారు. ప్రస్తుతం చిన్న చిన్న పనుల కోసం కూడా ప్రజలు వివిధ ప్రాంతాలకు తిరగాల్సి వస్తోందని, దీనివల్ల ప్రజలకు సమయం వృథా కావడంతో పాటు ఆర్థిక భారం కూడా పెరుగుతోందని ఆయన తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయ భవనం ఏర్పాటుతో ప్రజలకు ఒకే చోట అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని, అదే సమయంలో అధికారుల మధ్య సమన్వయం కూడా మెరుగుపడి పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. మల్లంపల్లి మండల సమగ్ర అభివృద్ధికి ఇది ఎంతో కీలకమని, ప్రభుత్వం వెంటనే స్పందించి సమగ్ర కార్యాలయ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అమ్మపురం టు అయోధ్య విజయవంతమైన ఆర్టీసీ బస్సు ప్రయాణం

- జీవితంలో మరుపురాని సంఘటనలు ఎన్నో చూసాం.

- పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు మనోహర స్వామి తో తన అనుభవాలను పంచుకున్న ప్రయాణికుడు మాచర్ల రామ్మూర్తి.


- జీవితంలో ఒకసారైనా చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయి.

- ఆర్టీసీ ప్రయాణం మాకు ఎంతో ఆనందాన్ని మిగిల్చింది.









**తొర్రూరు ప్రతినిధి, ఏప్రిల్ 11(పీసీడబ్ల్యు న్యూస్):** జీవితం అనేది నాలుగు గోడల మధ్యలో కూర్చుంటే సరిపోదు అంటున్నారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని, అమ్మాపురం గ్రామానికి చెందిన శ్రీరామ భక్తుడు మాచర్ల రామ్మూర్తి. బావిలో కప్ప నాకేం తక్కువ ఇంత పెద్ద ప్రపంచం చూస్తున్నాను అని అనుకుంటుందని ఒక సామెత ఉంది. మనం కూడా ప్రతినిత్యం మనం తిరిగే గ్రామాలలో చుట్టుపక్కల ప్రదేశాలలో చూసే దేవాలయాలు మరికొన్ని ఇతర ప్రదేశాలు చూడడమే కాక టీజీఎస్ఆర్టిసి బస్ డిపో తొర్రూర్ డిపో మేనేజర్ పద్మావతి తీసుకున్న నిర్ణయం హర్షించ తగిన విధంగా ఉందని అమ్మాపురం నుండి అయోధ్యకు వెళ్ళిన భక్తులు వారి అనుభవాలను జర్నలిస్ట్ మనోహర్ స్వామితో పంచుకున్నారు. ఇలాంటి ప్రదేశాలను చూసి త రించాల్సిన అవసరం ఎంతో ఉందని రామ్మూర్తి వారి అనుభవాలను విన్నవిస్తూ ఆర్టీసీ బస్సులో అయితే సుఖ ప్రయాణం ఉంటుందని అన్నారు. ఆరు రోజుల ప్రయాణం అలసట లేకుండా కొనసాగిందని మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్లలో చూడాల్సిన పుణ్యక్షేత్రాలను ఆర్టీసీ వారు చేయించారని అన్నారు. అమ్మాపురంలో 12 గంటలకు బయలుదేరిన బస్సు కరీంనగర్ జిల్లాలోని ధర్మపురి క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం తెల్లవారి మధ్యాహ్నం ప్రయాగ చేరుకున్నామని పేర్కొన్నారు. ప్రయాగ అనేది నదీ స్నానం మాత్రమే అక్కడినుండి నేరుగా కాశీకి వెళ్ళమని తెలిపారు. కాశీలో మాత్రం తొమ్మిది రోజులు తిరిగిన చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో మిగిలి ఉంటాయని మేము ఐదు ప్రాంతాలని తిరగటం జరిగిందని పగలు కాశీకి చేరుకోగా అక్కడ తెలుగువారు గైడ్ కాశీలో ఉన్న ప్రతి పుణ్యక్షేత్రాన్ని చూపించి తీసుకురావడానికి ఒక్కొక్కరికి 1500 రూపాయలు చొప్పున జమ చేస్తారని వారికి అన్ని విధాలుగా భోజన వసతి, పడుకునేందుకు వసతి, పడవ ప్రయాణం 24 గంటల లో కొన్ని ప్రదేశాలను చూపించి తీసుకొచ్చారని తెలిపారు. కాశీలో చూసిన పుణ్యక్షేత్రాలలో ముక్తేశ్వర్ ఆలయం ,కాలభైరవాలయం, సాక్షి గణపతి ఆలయం, అన్నపూర్ణేశ్వర దేవి ఆలయం, మాకు ఉన్న ఒక్కరోజు సమయం లోనే ఇవి చూడగలిగామన్నారు. అక్కడి నుండి మెహర్ మధ్యప్రదేశ్ లో గల శక్తి పీఠాలను చూడడం జరిగిందని అన్నారు. మాకు అన్ని విధాలుగా అక్కడ నివసిస్తున్న తెలుగువారు సహకరించాలని వారితోపాటు ఆర్టీసీ డ్రైవర్లు ,మెకానిక్ ఎంతో ఓర్పుతో ,నేర్పుతో ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బస్సును క్షేమంగా తీసుకువెళ్లి తీసుకొచ్చేందుకు వారికి ,ఆర్టీసీ అధికారులకు బస్సులో ప్రయాణించిన 36 మంది భక్తులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఇలాంటి ప్రయాణం మరోసారి ఆర్టీసీ వారు కల్పిస్తే వెళ్లి తీరాల్సిందే అని ఎంత చూసినా రెండు కళ్ళతో చూడలేమని ఇలాంటి ప్రయాణాలు జీవితంలో ఒక్కసారైనా చూసి తరించాల్సిందే అని అమ్మాపురం టు అయోధ్య వెళ్లిన భక్తులు వారి అనుభవాలను వెళ్ళబుచ్చారు.

# సమానత్వ సమాజానికి మార్గదర్శి మహాత్మా పూలే

- టిడిపి నాయకులు కేతినేని హరీష్
- టిడిపి కార్యాలయంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా
- పూలే ఆశయాలకు నివాళులు అర్పించిన టిడిపి నాయకులు
- స్త్రీ విద్య, దళిత సాధికారతకు పూలే చేసిన సేవలు స్మరణీయం



**ఖమ్మం ప్రతినిధి, ఏప్రిల్ 11 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సమాజంలో అజ్ఞానం, అసమానతలను తొలగించి సమానత్వానికి బాటలు వేసిన మహానుభావుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని టిడిపి నాయకులు, హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మీగడ రామారావు లు అన్నారు. మహాత్మా జ్యోతిరావుపూలే 199వ జయంతి సందర్భంగా శనివారం ఖమ్మం తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమం సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. అనంతరం హడ్ హాక్ కమిటీ సభ్యులు కేతినేని హరీష్, మీగడ రామారావు మాట్లాడుతూ... పూలే మహారాష్ట్రకు చెందిన గొప్ప సంఘ సంస్కర్తగా, విద్యావేత్తగా, సామాజిక విప్లవకారుడిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. స్త్రీ విద్యకు పునాది వేస్తూ, దళిత సాధికారత కోసం, అంటరానితన నిర్మూలనకోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తుచేశారు. తన సహచరిణి సావిత్రిబాయి పూలేతో కలిసి 1848లో పూణేలో బాలికలకోసం తొలి పాఠశాలను స్థాపించడం ద్వారా మహిళా విద్యకు నాంది పలికారని పేర్కొన్నారు. ఆ కాలంలో ఎదురైన అనేక అడ్డంకులను ధైర్యంగా ఎదుర్కొని సమాజంలో మార్పు తీసుకురావడంలో పూలే దంపతులు చూపిన పట్టుదల ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ, పూలే ఆశయాలను ఆచరణలో పెట్టి సమాన హక్కుల సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన చూపిన మార్గం నేటికీ సమాజానికి దిక్సూచి వంటిదని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం మొత్తం పూలే మహనీయుని సేవలను స్మరించుకుంటూ, సమాజ సేవ పట్ల మరింత నిబద్ధతను పెంపొందించేలా సాగింది. ఈ కార్యక్రమంలో పెనుగొండ ఉపేందర్, చింతనిప్పు నాగేశ్వరరావు, కన్నెటి పృధ్వీ, కోటేశ్వరరావు, మల్లెంపాటి రాము, కొండబాల అశోక్, దామాల శివ, కావూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

# మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌లు చారిత్రకం ...

- దశాబ్దాల పాటు నిలిచిపోయిన హక్కుఇప్పుడుసాకారమవుతుంది.

- ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలకు ప్రాతినిధ్యం వహించే హక్కులు...

- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి...



**కరీంనగర్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** నారీశక్తి వందన్ (మహిళా రిజర్వేషన్ బిల్లు) పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీలో మహిళలకు 33 శాతం మూడో వంతు సీట్లను రిజర్వ్ చేస్తూ , రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే చారిత్రక చట్టం అమలుకు కౌంట్ డౌన్ మొదలైందని, ఏప్రిల్ 16న చట్టం అమలు కాబోతున్న శుభ సందర్భంలో బిజెపి శ్రేణులు సంబరాలకు సిద్ధం కావాలని జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం బిజెపి ముఖ్య నేతలు, మండల అధ్యక్షులు, కార్పొరేటర్లతో నారీ శక్తి వందన్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమలవుతున్న నేపథ్యంపై, ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి వేడుకలను పురస్కరించుకొని బిజెపి శ్రేణులకు దిశా నిర్దేశనం చేయడానికి సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దశాబ్దాల పాటు నిలిచిపోయిన మహిళల హక్కుఇప్పుడుసాకారమవుతుందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళలకు ప్రాతినిధ్యం వహించే హక్కు లభిస్తుందన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ లు చారిత్రకమైందన్నారు. రాజకీయాల్లో మహిళలకు ఆత్మగౌరవం, ఆర్థిక స్వతంత్ర, న్యాయమైన వాటా కల్పించిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ చారిత్రక ఘట్టం, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తున్న నేపథ్యంలో కరీంనగర్ జిల్లాలో బిజెపి శ్రేణులు సంబరాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మహిళలు ఈ సంబరాల్లో అధిక సంఖ్యలో పాల్గొనేలా కృషిచేసి, ప్రధాని మోడీకి కృతజ్ఞతలు తెలియజేయాలన్నారు. అలాగే ఏప్రిల్ 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు ఈనుకొండ నాగేశ్వర్ రెడ్డి, గుజ్జ శ్రీనివాస్ ,ఉపాధ్యక్షులు సాయిని మల్లేశం, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, కార్పొరేటర్లు, మండల, జోన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.

# భట్రాజు సంఘ ఎన్నికలపై సందేహాలు... పారదర్శకత ఎక్కడ?

- జిల్లా సభ్యత్వం VS ఆధార్ అడ్రస్... ఏది అసలు ప్రమాణం?
- హైదరాబాద్ వన్ ఎన్నికలపై ప్రశ్నల వెల్లువ బైలా ప్రకారం ఎన్నికలు జరుగుతున్నాయా?
- వేరే జిల్లాల వారికి బాధ్యతలుడ నిబంధనలు ఎక్కడ?
- భట్రాజు సంఘంలో ఎన్నికల వివాదం మరింత ముదురుతోంది
- జిల్లా నాయకత్వంలో స్థానికతకు ప్రాధాన్యత ఉందా?
- ఎన్నికలపై సంఘంలో అసంతృప్తి పెరుగుతోందిబి కీర్తి సంతోష్ రాజ్



**హైదరాబాద్,ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర భట్రాజు సంఘ ఎన్నికలు రోజురోజుకు వివాదాస్పదంగా మారుతున్న నేపథ్యంలో, హైదరాబాద్ వన్ ఎన్నికల తరువాత సంఘ సభ్యుల్లో అనేక సందేహాలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉందా అనే ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా సభ్యత్వం ఉన్న వ్యక్తికి ఆ జిల్లాలో ఆధార్ కార్డు అడ్రస్ లేకపోయినా, ఆ జిల్లాలో నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ఎంతవరకు సమంజసం అనే అంశంపై చర్చ జరుగుతోంది. ఒకవేళ సభ్యత్వం ఉన్న జిల్లానే ప్రమాణంగా తీసుకుంటారా? లేక ఆధార్ కార్డు అడ్రస్‌ను ప్రామాణికంగా పరిగణిస్తారా? లేదా ఆ జిల్లాలో నివాసం ఉన్నట్టు ఇతర పత్రాలు చూపితే సరిపోతుందా? అనే ప్రశ్నలు సంఘంలో చర్చనీయాంశమయ్యాయి. కొన్ని జిల్లాల్లో వేరే జిల్లాలకు చెందిన వ్యక్తులకు నాయకత్వ బాధ్యతలు అప్పగించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో, “ఒక జిల్లాలో నివసించని వ్యక్తి ఆ జిల్లాకు అధ్యక్షుడిగా ఎలా ఎంపిక అవుతారు?” అనే ప్రశ్నను సభ్యులు లేవనెత్తుతున్నారు. జిల్లా స్థాయి నాయకత్వానికి స్థానికత ప్రాధాన్యత ఇవ్వాలా? లేక సభ్యత్వమే సరిపోతుందా? అనే అంశంపై స్పష్టత కోరుతున్నారు. ఇదే సమయంలో, చిన్న చిన్న సమస్యలపైనా రాష్ట్ర నాయకత్వం స్పందించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఎన్నికలు బైలా ప్రకారం నిర్వహించబడుతున్నాయా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ వన్ ఎన్నికలు నిజంగా నిబంధనల ప్రకారమే జరిగాయా? అనే ప్రశ్న కూడా ముందుకు వస్తోంది. భట్రాజులు కవులు, మేధావులు, పండితులుగా పేరుగాంచిన సమాజమని, అలాంటి సంఘంలో ఈ తరహా వివాదాలు తలెత్తడం విచారకరమని సభ్యులు అభిప్రాయపడుతున్నారు. “అందరూ ఒకటే సమాజానికి చెందినవారమని భావిస్తేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుంది” అని వారు అంటున్నారు. ఇకపై జరగబోయే జిల్లా ఎన్నికలైనా కచ్చితంగా బైలా ప్రకారం, పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. ముఖ్యంగా, గ్రేటర్ హైదరాబాద్ వన్ ఎన్నికల తేదీని స్పష్టంగా ప్రకటించాలని, ఎన్నికల ప్రక్రియపై పూర్తి వివరణ ఇవ్వాలని కీర్తి సంతోష్ రాజ్ రాష్ట్ర సంఘ పెద్దలను కోరారు. ప్రశ్నలు మాత్రం మిగిలే ఉన్నాయిడ సమాధానాలు ఎప్పుడు?

# పూలే ఆశయాల సాధనకు ఐక్యంగా ముందుకు సాగుదాం

- వెల్‌జర్ల గ్రామంలోని మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు
- ముఖ్యఅతిథిగా హాజరైన సర్పంచ్ ఆర్ బాబు నాయక్



**షాద్ నగర్, ఏప్రిల్11(పీసీడబ్ల్యూ న్యూస్):** వెల్ జర్ల అంబేద్కర్ అధ్యక్షుడు తుప్పరి జంగయ్య ఆధ్వర్యంలో వెల్‌జర్ల గ్రామంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకున్న సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో ఘనంగా నిర్వహించి... ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివారాలు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ ఆర్. బాబు నాయక్, ఉప సర్పంచ్ దొడల వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు, బహుజన్ సమాజ్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలకు అతీతంగా పాల్గొన్నారు. పలువురు మాట్లాడుతూ...మహాత్మా జ్యోతిరావు పూలే ఒక మహనీయుడు, గొప్ప సంఘసంస్కర్తగా సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. సమానత్వం, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి తరతరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. పూలే ఆశయాలను సాకారం చేసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఆయన చూపిన బాటలో నడుస్తూ... సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామంలో పూలే విగ్రహ ప్రతిష్ఠాపనకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి, గ్రామంలోని విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠాపనకు అవసరమైన స్థలం సేకరణ కోసం ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు.